www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 30 డిసెంబర్ 2024
5
పశ్చిమ గోదావరి



మాధవనాయుడుకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

మాజీ ఎంఎల్ఎ బందారు మాధవనాయుడును పలువురు ప్రముఖులు ఆదివారం పరామర్శించారు. మాధవనాయుడు తండ్రి ప్రతాప్‌నాయుడు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. సరిపల్లిలోని మాధవనాయుడు నివాసంలో తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు పరామర్శించారు. తొలుత ప్రతాప్‌నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, బందారు పటేల్ నాయుడు, కొండేటి త్రినాధ్, కొండేటి శ్రీను, పులపర్తి సత్య, నడిపూడి కృష్ణ, పులపర్తి దత్తు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భీమవరం బాలోత్సవం

అట్టహాసంగా సాగిన రెండో పిల్లల సంబరాలు - ఐదు వేల మందికిపైగా పాల్గొన్న బాల బాలికలు, తల్లిదండ్రులు



బాలికల కోలాట ప్రదర్శన

'సంప్రదాయ దుస్తుల్లో చిన్నారుల ఉరుకులు, పరుగులు. మరో రెండు అడుగులు వేస్తే విచిత్ర వేషధారణలో హొయలొలికిస్తున్న బుడతలు.. వేదికవైపు చూస్తూ అత్యంత ఆకర్షణీయంగా సాగుతున్న నృత్య ప్రదర్శనలు.. మరోపక్క చిన్నారుల ఆట పాటలు..' ఈ దృశ్యాలు స్థానిక ఎస్‌సిహెచ్‌బిఆర్ఎం హైస్కూల్‌లో శని, ఆదివారాల్లో నిర్వహించిన భీమవరం బాలోత్సవం సందర్భంగా కనువిందు చేశాయి.

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రెండు రోజులపాటు సాగిన పిల్లల సంబరాలు జోరుగా, హుషారుగా సాగాయి. మానసికోల్లాసంతోపాటు మానసిక వికాసానికి దోహదపడే వాతావరణంలో భీమవరం బాలోత్సవం సాగింది. వినికిడి, మాట లోపం ఉన్న విద్యార్థులు 'మేము సైతం' అంటూ పిల్లల సంబరాల్లో అలరించారు. మ్యాజిక్‌షో అందరినీ అబ్బురపర్చింది. ఈ బాలోత్సవంలో భీమవరం పరిసరాల్లో ఎనిమిది మండలాల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు వేలాదిగా పాల్గొని పిల్లల సంబరాలను జయప్రదం చేశారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం, ముగింపు సభ ఆదివారం రాత్రి జరిగింది. తొలుత బాలోత్సవం నిర్వహణ కమిటీ అధ్యక్షులు, రిటైర్డ్ డిఇఒ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ రెండు రోజులపాటు పండుగ వాతావరణంలో సాగిన బాలోత్సవం బాలబాలికల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపిందన్నారు. బాలోత్సవం నిర్వహణకు పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు సహకారం అందించాయని తెలిపారు. జిల్లా కేంద్రమైన భీమవరంలో సైన్స్ పార్క్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యఅతిథిగా పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి మాట్లాడుతూ వినోదంతోపాటు ప్రతిభను వెలికితీసే వేదిక బాలోత్సవం అన్నారు. ఈ బాలోత్సవాన్ని బాలబాలికలు పెద్ద సంఖ్యలో వినియోగించుకోవాలన్నారు. ఇంత పెద్ద కార్యక్రమానికి అంతా సహకరించడం అభినందనీయమన్నారు. యువిఎస్ఎం ఐ హాస్పిటల్ అధినేత రమణరాజు మాట్లాడుతూ బాలోత్సవంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారం మరువలేనిదన్నారు. బాల బాలికలకు భీమవరం బాలోత్సవం పునాదిగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. జనసేన జిల్లా కార్యదర్శి చనమలశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే వారిలోని సృజనాత్మకతను వెలికితీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దానికి భీమవరం బాలోత్సవం వేదిక కావడం ప్రశంసనీయమన్నారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్లు సాయి రాజు, రామ, సాయి వర్మ రాజు మాట్లాడుతూ బాలోత్సవం పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడుతుందన్నారు. తమ బాల్యాన్ని గుర్తు చేసుకున్నామని, తనకు చాలా సంతోషం, స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. తమ విద్యాసంస్థల తరపున కూడా రానున్న రోజుల్లో తమ విద్యాసంస్థల తరపున విశేష, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలనే చైతన్యం బాలోత్సవం తమలో నింపిందన్నారు. అనంతరం విజేతలకు అతిథులు మీదుగా బహుమతులు అందజేశారు. తొలిరోజు పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపీమూర్తి చేతుల మీదుగా బాలోత్సవం ప్రారంభమవ్వగా డిఇఒతోపాటు డిఎంహెచ్ఒ మహేశ్వరరావు పిల్లల ప్రదర్శనలను తిలకించి అభినందించారు. రెండో రోజు భీమవరం ఎంఎల్ఎ, పియుసి ఛైర్మన్ పి.అంజిబాబు పిల్లల విన్యాసాలను ఆద్యంతం తిలకించి ప్రశంసల జల్లు కురిపించారు. ఉపాధ్యాయులు పి.రామభద్రరాజు, జిపిసి.రాజు ఆధ్వర్యంలో విద్యార్థులు జిమ్నాస్టిక్స్‌లో భాగంగా ప్రదర్శించిన రోప్ స్కిప్పింగ్, మాల్కంబ్ పోల్ ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనను అభినందించిన వసుధ ఫౌండేషన్ నిర్వాహకులు విద్యార్థులకు రూ.పది వేల నగదు బహుమతి అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో నాయకులు కారుమూరి సత్యనారాయణ, గాదిరాజు తాతరాజు, బండి రమేష్, భీమవరం బాలోత్సవం ప్రధాన కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య, అసోసియేట్ అధ్యక్షుడు గాతల జేమ్స్, అసోసియేట్ కార్యదర్శి జి.ధనుష్, కార్యవర్గ సభ్యులు, జి రఫాయేలు, ఎ.శ్రీదేవి, క్రాంతిబాబు, యశ్వంత్, కిరణ్, ఎస్‌సిహెచ్‌బిఆర్ఎం హైస్కూలు ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, డిఎన్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శివాజీరాజు, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, చైతన్య ప్రసాద్, పి.శ్రీనివాసరాజు, గోపాలశర్మ, మల్లుల శ్రీనివాస్, వేణుగోపాల్, గోపాలశర్మ ఎస్‌కె.వలీ, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.



మాల్కంబ్ పోల్ విన్యాసాలు



బహుమతులు అందజేస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

తాగునీటి సమస్య పరిష్కరించాలి

మర్రితిప్ప కాలనీవాసుల ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం

మర్రితిప్పలోని జగనన్న కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ కాలనీ వద్ద స్థానికులు చేపట్టిన ఆందోళనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ కాలనీలో 15 కుటుంబాలు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని నివాసముంటున్నాయన్నారు. నాలుగు నెలలుగా కుళాయి నీరు రాకపోవడం వల్ల తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమం పేరుతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు తాగునీరు అందించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు మద్యం అందించడంలో ఉన్న శ్రద్ధ నీరందించడంలో లేదని ఎద్దేవా చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేదని స్థానికులు వాపోయారు. అధికారులు తక్షణం స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుబ్బల గంగారత్నం, గుబ్బల జయలక్ష్మి, కవురు లక్ష్మి, దాసరి పద్మ, గుండుబోయిన జ్యోతి, కైలా కుమారి తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, మహిళలు

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఇప్పటివరకూ 237 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని, భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ ద్వారా ప్రజల నుంచి భూ సంబంధ, రెవెన్యూ శాఖల పరంగా మ్యుటేషన్, కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలు, పట్టాదారు పాసు పుస్తకాలు తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. 20 మండలాల్లోని 320 రెవెన్యూ గ్రామాలకు గాను 237 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను శనివారం నాటికి పూర్తి చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 13 నుంచి ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు జనవరి 8వ తేదీతో ముగుస్తాయన్నారు.

జగన్ అసత్య ప్రచారాలు మానాలి : పితాని

పోడూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రోడ్డు పడ్డాడని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం కొమ్ముచిక్కాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచిందనే అసత్య ప్రచారాలను జగన్ మానుకోవాలని హితవు పలికారు. జగన్ అరాచకాలు తట్టుకోలేక వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపి, జనసేనలో చేరుతున్నారన్నారు. విద్యుత్ ఛార్జీల జగన్ కుంభకోణంతో ప్రజా మూల్యం చెల్లించుకున్నాడని అన్నారు. యూనిట్ ఛార్జీలు దఫదఫాలుగా పెంచిన ఘనత జగన్‌దే అని విమర్శించారు. గత ప్రభుత్వంలో విద్యుత్ స్కాం నిర్వహణ వైఫల్యంపై రూ.618 కోట్లుగా కూటమి ప్రభుత్వం అంచనా వేసిందని ఆయన తెలిపారు.

14 నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

జాతీయ స్థాయి స్త్రీ, పురుష కబడ్డీ పోటీలు జనవరి 14 నుంచి 18వ తేదీ మధ్య నరసాపురం పట్టణం రుస్తుబాదలో నిర్వహించనున్నట్లు మాజీ ఎంఎల్ఎ, గోగులమ్మ ఉత్సవ కమిటీ కన్వీనర్ కొత్తపల్లి జానకిరామ్ తెలిపారు. ఆదివారం స్థానిక రుస్తుంబాద గోగులమ్మ ఆలయం వద్ద జానకీరామ్, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ సిఇఒ వి.వీర్ల వెంకయ్య, కార్యదర్శి పి.పద్మజాబాలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 31 సంవత్సరాల నుంచి నిర్విరామంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 32వ జాతీయ కబడ్డీ పోటీలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పండుగ సందర్భంగా యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఉండేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. నిరంతరాయంగా జాతీయస్థాయి స్త్రీ, పురుష కబడ్డీ పోటీలు నిర్వహించడం కొత్తపల్లి సోదరులకే చెల్లిందన్నారు. జాతీయ స్థాయి నుంచి 29 పురుష, 16 మహిళా జట్లు ఈ పోటీల్లో పాల్గొనేందుకు సుముఖత వ్యక్తం చేశాయన్నారు. కేరళ, హర్యానా, భువనేశ్వర్, జమ్మూకాశ్మీర్, ఢిల్లీ, కలకత్తా, హరిద్వార్, నాగపూర్, బెంగళూర్, హర్యానా, మహారాష్ట్ర, చండీఘర్, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ ఏడాది క్రీడాకారులకు ఇచ్చే నగదు బహుమతి పెంచామన్నారు. మొదటి బహుమతిగా రూ.లక్ష యాభై వేలు, రెండో బహుమతి రూ.లక్ష, మూడో బహుమతి రూ.75 వేలు, నాలుగో బహుమతి రూ.50 వేలుగా నిర్ణయించామన్నారు. లీడ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్.రాము, సెక్రటరీ టి.లవకుమార్, ఎపి కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి.శ్యామల, సిహెచ్.రాజు తదితరులు మాట్లాడారు. ఉత్సవ కమిటీ సభ్యులు కొప్పినీడి గోపి, యాదంరెడ్డి శేషగిరి, అడబాల బాబులు, కుంచె ఈశ్వరరావు, గంధం రవి, గన్నాబత్తుల బాబ్జి, బాపూజీ, చినమిల్లి ముమ్ము, మహేష్, ఆంజనేయులు, నారాయణ పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి

రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరి భాస్కరయ్య డిమాండ్ చేశారు. రజక వృత్తిదారుల సంఘం పట్టణ మహాసభ స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం డి.అమ్మరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి భాస్కరయ్య మాట్లాడుతూ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రజకులకు సామాజిక రక్షణ చట్టం ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం మాదిరిగా తీసుకురావాలన్నారు. రజక వృత్తి చెరువులపై పూర్తి హక్కు కల్పించాలని, జిఒ నెం.27 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేయాలని, రజక కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. ఆదరణ పథకం ద్వారా అధునాతన పరికరాలు అందించి జీవనోపాధి కల్పించాలన్నారు. అపార్టుమెంట్ వాచ్‌మెంట్ కమ్ ఇస్త్రీదారులకు కనీస వేతన చట్టం ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పులూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ రజక కార్పొరేషన్ ద్వారా వీలైనంత సాయం అందిస్తామన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడక రాజు మాట్లాడుతూ రజకులకు 50 సంవత్సరాలకే పెన్షన్లు ఇవ్వాలని, ఆదరణ పథకం ద్వారా 90 శాతం సబ్సిడీతో రజకులందరికీ రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ సభలో చింతాడి శ్రీనివాస్, రేవూరి గోగిరాజు, మాజీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగారావు, న్యాయవాది లోకేష్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో చంద్రిక మూర్తి, ఎన్.గంగాధర్, బేతపూడి లోకేష్, మల్లెపూడి వెంకటేశ్వరరావు, యండమూరి నాగేంద్ర, తలుపూరి నవీన్ కుమార్, గురుమూర్తి, గంటి నాని, చెంచినాడు పెద్దరాజు, సత్తివాడు ముసలయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది.



మాట్లాడుతున్న భాస్కరయ్య



కొన ఊపిరితో అన్నదాత..!

అన్నదాత ఆర్తనాదాలు 2024లోనూ మిన్నంటాయి. ప్రభుత్వాలు మారినా రైతుల పట్ల పాలకులకు ఉన్న చిన్నచూపు మాత్రం మారలేదు. వరదలు, తుఫాన్లకు రైతులు ఈ ఏడాదిలో దాదాపు 30 వేల ఎకరాల్లో వరి పంటను కోల్పోయారు. సాగు చేసిన కౌలురైతులకు ప్రభుత్వం ఏమాత్రం అండగా నిలబడలేకపోయింది. పంట నష్టపరిహారంతో సహా ఏ ఒక్కటీ వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు అందలేదు. ఆక్వా రైతుల కష్టాలు చెప్పచాలనవిగా మారాయి. ఎగుడు, దిగుడు ధరలతో మామిడి, పామాయిల్, కొబ్బరి రైతుల అవస్థలు వర్ణనాతీతం. పెరిగిన పెట్టుబడి ఖర్చులకు, వస్తున్న ఆదాయానికి ఏమాత్రం సంబంధం లేకపోవడంతో అన్నదాత కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఏడాదిలోనూ జిల్లాలో పలువురు కౌలురైతులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు అందరినీ కలిచివేశాయి.

2024లో రైతులను వెంటాడిన కష్టాలు

- వరదలు, తుపాన్లకు 30 వేల ఎకరాల్లో పంటనష్టం
- రబీ ధాన్యం సొమ్ము కోసం రైతులు నెలలు తరబడి పడిగాపులు
- ఆక్వా రైతుల అవస్థలు వర్ణనాతీతం
- పామాయిల్, కొబ్బరి రైతులకు స్వల్ప ఊరట
- ఆధునికీకరణకు పూర్తిగా పాతర



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్దఎత్తున వరి సాగవుతోంది. రెండు సీజన్లు రబీ, ఖరీఫ్‌లో కలిపి పశ్చిమలో దాదాపు నాలుగున్నర లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. 2023 డిసెంబర్ రెండో వారంలో మిచౌంగ్ తుపాను విరుచుకుపడటంతో రబీ నారుమడులన్నీ దెబ్బతిన్నాయి. రైతులు రెండోసారి నారుమడులు వేయాల్సి వచ్చింది. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ రబీ నాట్లు సాగాయి. నీటిఎద్దడి సమస్యలను ఎదుర్కొని పంట పండించిన రైతులు ధాన్యం అమ్మకంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లారీలు, గోనె సంచుల కోసం నానావస్థలు పడ్డారు. తీరా ధాన్యం విక్రయించిన తర్వాత రైతులకు ధాన్యం సొమ్ము అందక రైతులు పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. ఎన్నికలు రావడంతో రైతుల గోడును పట్టించుకునే నాథుడే లేకపోయాడు. పశ్చిమలో రూ.850 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.242 కోట్లు మొత్తం దాదాపు రూ.11 వందల కోట్లు ధాన్యం సొమ్ము రైతులకు అందలేదు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత సెప్టెంబర్ వరకూ ధాన్యం సొమ్ము అందలేదు. ఏప్రిల్‌లో రబీ మాసూళ్లు పూర్తి చేసిన రైతులకు దాదాపు ఐదు నెలల తర్వాత ధాన్యం సొమ్ము అందడంతో తెచ్చిన పెట్టుబడులకు వడ్డీ తడిసిమోపెడై రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూన్ ఒకటో తేదీనే కాలువలకు సాగునీరు విడుదల చేసినప్పటికీ జూన్ నెలాఖరునగాని నారుమడులు వేయడం ప్రారంభం కాలేదు. జులై మొదటి వారంలో విరుచుకుపడిన భారీ వర్షాలకు పశ్చిమలో 30 వేల ఎకరాల్లో, ఏలూరులో మూడు వేల ఎకరాల్లో నాట్లు దెబ్బతిన్నాయి. దాదాపు 1600 ఎకరాల్లో నారుమడులు దెబ్బతిన్నాయి. ఎన్యుమరేషన్ చేసిన అధికారులు 13,307 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు తేల్చి మమ అనిపించారు. ఆదిలోనే రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. సెప్టెంబర్‌లో మరోసారి విరుచుకుపడిన వరదలు, వర్షాలకు ఏలూరు జిల్లాలో 7,884, పశ్చిమలో 8,546 ఎకరాల్లో మొత్తం దాదాపు 16 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో రైతులకు రూ.16 కోట్లు నష్టం వాటిల్లిందని అధికారులు తేల్చారు. 33 శాతానికిపైగా నష్టాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. అంతకన్నా తక్కువ నష్టపోయిన పంట వేలాది ఎకరాల్లో ఉంది. అలాంటి రైతులకు చిల్లిగవ్వ రాలేదు. సెప్టెంబర్‌లో దెబ్బతిన్న పంటలకు పరిహారం ప్రభుత్వం అందించింది. జులైలో దెబ్బతిన్న పంటలకు సంబంధించి రెండు జిల్లాల్లో రూ.11 కోట్లు నష్టపరిహారం అందించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటికీ అందించలేదు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ మూడుసార్లు వాయుగుండాలు రైతులను వెంటాడాయి. దీంతో రైతులు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. ధాన్యం సొమ్ము త్వరితగతిన పడటం ఈసారి రైతులకు కొంత ఊరటగా చెప్పొచ్చు. అన్నదాత సుఖీభవ పేరుతో ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ అందించకపోవడంపై రైతుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

కౌలురైతుల పరిస్థితి అధ్వానం..★★★

ప్రభుత్వాలు మారినా కౌలురైతుల పరిస్థితి మాత్రం మారలేదు. కౌలుకార్డుల జారీలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగింది. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉండగా ఏలూరు జిల్లాలో 65 వేల మందికి, పశ్చిమలో 87 వేల మందికే కౌలుకార్డులు జారీ చేశారు. రెండు జిల్లాల్లో ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 20 వేల మందికి రూ.140 కోట్లు, పశ్చిమలో 24 వేల మంది కౌలురైతులకు రూ.162 కోట్లు మాత్రమే రుణాలు మంజూరు చేశారు. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో ఒక్కశాతం కూడా కౌలురైతులకు పంట రుణాలు అందించని పరిస్థితి నెలకొంది. వ్యవసాయం సాగు చేస్తున్న కౌలురైతులకు కాకుండా, సాగు చేయని భూయజమానులకు బ్యాంకర్లు పంట రుణాలు అందిస్తున్నారు. ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు పరిహారంగాని, బీమాగాని ఏ ఒక్కటీ కౌలురైతులకు అందలేదు. కౌలుచట్టంలో మార్పులు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రకటనలతోనే సరిపెట్టింది. దీంతో ఈ ఏడాది కౌలురైతులకు తీరని వ్యథే మిగిలింది.

ఆక్వా రైతులు విలవిల★★★

రొయ్యలు, చేపల సాగు చేస్తున్న రైతులు ఈ ఏడాది తీవ్ర కష్టాలు ఎదుర్కొన్నారు. సరైన ధర లేక, మేత ధరలు పెరిగిపోయి ఆక్వా రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుండగా అందులో 90 వేల ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. చేపల ధర ఈ ఏడాదిలో అనేకసార్లు పడిపోయింది. కిలో రూ.125 ఉండే చేప ధర రూ.114 వరకూ పడిపోవడంతో చేపలు సాగు చేసే రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. రూప్‌చంద్ చేపల ధర కిలో రూ.80కి పడిపోయింది. రొయ్యల ధరలు సైతం నిలకడగా లేకపోవడం, వ్యాధులు చుట్టుముట్టడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రొయ్య సాగుచేసే రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు.

పామాయిల్, కొబ్బరి, మామిడి రైతుల కష్టాలు★★★

ఈ ఏడాది ఎగుడు, దిగుడు ధరలతో పామాయిల్, కొబ్బరి, మామిడి రైతులు కొంత ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ ఏడాది ఆరంభం నుంచి టన్ను పామాయిల్ ధర రూ.12,900 మాత్రమే పలికింది. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. కొద్దిరోజుల క్రితం అనూహ్యంగా టన్ను ధర రూ.20 వేలు వరకూ పెరిగింది. అయితే పామాయిల్ సీజన్ తగ్గడంతో రైతులకు పెద్దగా ఉపయోగం లేని పరిస్థితి. కొబ్బరి రైతులకూ అదే పరిస్థితి. చాలా నెలలు కొబ్బరికాయ ఖరీదు ఆరేడు రూపాయలు మాత్రమే పలికింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కనీసంగా కాయ ధర రూ.15 ఉండాలంటూ రైతులు డిమాండ్ చేశారు. నవంబర్ నుంచి కొబ్బరి ధర సైతం పెరిగింది. కాయ రూ.12 నుంచి రూ.14 వరకూ పలుకుతోంది. దీంతో రైతులకు కొంత ఊరట ఏర్పడింది. ఈ ఏడాది తుపాన్లు, తెగుళ్లతో మామిడి రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ధర కొంత ఆశాజనకంగా ఉన్నా దిగుబడి లేకుండాపోయింది. తేనె మంచుతో తెగుళ్ల సోకి మామిడి దిగుబడి అమాంతం పడిపోవడంతో రైతులకు ప్రయోజనం లేకుండాపోయింది.

అగ్రిమెంట్లు లేకుండానే మొక్కజొన్న సాగు..★★★

మొక్కజొన్న రైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. దీనిలో సగానికిపైగా కంపెనీలు ఇచ్చే సీడ్స్ పంటనే సాగు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం రైతులకు సీడ్స్ అందించే కంపెనీలు అగ్రిమెంట్లు చేసుకోవాలి. ఎక్కడా అలా జరగడం లేదు. దీంతో పంట దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కంపెనీలు ఆదుకోవడం లేదు. నిబంధనల ప్రకారం రైతుకు దిగుబడి రాక నష్టపోతే సీడ్స్ కంపెనీలే నష్టపరిహారం ఇవ్వాలి. ఎక్కడా అలా జరగడం లేదు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఈ ఏడాదీ అదేవిధమైన పరిస్థితి సాగింది.

అటకెక్కిన డెల్టా ఆధునికీకరణ..★★★

గడిచిన ఐదేళ్లలో డెల్టా ఆధునికీకరణను పూర్తిగా గాలికొదిలేశారు. దాదాపు రూ.వెయ్యి కోట్లు పనులు చేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చినా ఆధునికీకరణపై దృష్టి పెట్టిన పరిస్థితి కన్పించడం లేదు. ఆధునికీకరణ పనులు చేయాలంటే జనవరిలో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలి. కాలువలు మూసేసిన వెంటనే ఏప్రిల్ నెలాఖరు నుంచి పనులు ప్రారంభించి జూన్ ఒకటో తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ అటువంటి ప్రక్రియ ఏమీ జరగలేదు. డెల్టా ఆధునికీకరణ జరగకపోవడంతో ప్రతియేటా వరదలకు వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింటోంది. కాలువలు మెరకదేరి శివారు పొలాలకు నీటి ఎద్దడి సమస్య వెంటాడుతోంది.

ఆగని కౌలురైతుల ఆత్మహత్యలు..★★★

వ్యవసాయ సాగులో కీలకమైన కౌలురైతులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీంతో కౌలురైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. 2024లో పోలవరం, ముసునూరు తదితర మండలాల్లో రైతులు, కౌలురైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బతినడంతో అప్పులు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం నుంచి కౌలురైతులకు ఎటువంటి సాయమూ అందకపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో అందరికీ అన్నం పెట్టే అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - తణుకు

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 31 మందికి సుమారు రూ.40,46,249 చెక్కులను బాధితులకు అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక కష్టాలు ఉన్నా సరే నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కర్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం: ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందిన పలువురికి ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ జనసేన కార్యాలయం వద్ద సిఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. నలుగురు లబ్ధిదారులు నరసాపురం పట్టణం 7వ వార్డుకు చెందిన కావలి వెంకట రామకృష్ణకు రూ.1,41,052, రాయపేటకు చెందిన మండెల సీతా లక్ష్మీతాయారుకు రూ.81,000, మొగల్తూరు మండలం కోమటితిప్ప గ్రామానికి చెందిన ఉల్లంపర్తి సూర్య ప్రకాశరావుకు రూ.82,096, నరసాపురం మండలం రాజుల్లంకకు చెందిన ఉద్దరాజు దుర్గరాజుకు రూ.1,24,271 మొత్తం రూ.4,28,419 విలువైన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వలవల నాని, ఆకన చంద్రశేఖర్, పోలిశెట్టి సాంబ, బందెల రవీంద్ర పాల్గొన్నారు.

తణుకులో క్రాస్ కంట్రీ జట్ల ఎంపికలు

ప్రజాశక్తి - తణుకు


విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేస్తున్న సభ్యులు

జిల్లా క్రాస్ కంట్రీ (రోడ్డు రన్) జట్ల ఎంపికలు తణుకులోని డీమార్ట్ రోడ్డు వద్ద ఆదివారం నిర్వహించారు. బాలుర పోటీలను మానేపల్లి శ్రీనివాస్, బాలికల పోటీలను బసవ రామకృష్ణ ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు జనవరిలో వేల్పూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న సుమారు రెండు వందల మంది క్రీడాకారులకు కొమ్మిశెట్టి జయకృష్ణ, పత్తుల ఆశిష్‌విక్టర్ సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ సత్యనారాయణ, ట్రెజరర్ కె.బాబూరావు, వ్యాయమ ఉపాధ్యాయులు కె.సీతారామయ్య, బి.స్వామి, ఎ.నాగేశ్వరరావు, కె.వెంకన్నబాబు, జి.రవి, కె.సంధ్య, బి.శేఖర్, వై.శ్రీకాంత్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఎంఎల్ఎ చేయూత

ప్రజాశక్తి - తణుకు

తణుకు మండలం మండపాక గ్రామానికి చెందిన చీలి సురేష్ అనూషా దంపతుల 15 నెలల కుమార్తెకు గుండె సమస్య ఉంది. సమస్యను ఆ దంపతులు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణకు విన్నవించుకున్నారు. స్పందించిన ఎంఎల్ఎ హైదరాబాద్ స్టార్ హాస్పటల్ వైద్యులతో మాట్లాడి ఆపరేషన్ చేయించారు. రూ.10 లక్షల ఖర్చుతో కూడుకున్న వైద్యాన్ని ఉచితంగా చేయించిన రాధాకృష్ణకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు స్టార్ హాస్పటల్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఒక రోజు ముందే పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వ అదేశాల మేరకు మండలంలోని లబ్ధిదారులకు ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ బివిఎస్‌వి.శర్మ తెలిపారు. ఈనెల 31వ తేదీ మంగళవారం ఉదయం నుండి అన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు ఆధ్వర్యంలో స్థానిక 39వ వార్డు దుర్గాపురం నుంచి కోరాడ ఆంజనేయులు తన మిత్ర బృందంతో ఆదివారం టిడిపిలో చేరారు. నూతనంగా టిడిపిలో చేరిన వారికి పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్ధసారథి టిడిపి కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధిని చూసి అనేకమంది యువత టిడిపిలో చేరడం ఆనందదాయకమన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వెంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదు పునరుద్ధరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న భీమవరం నియోజకవర్గ టిడిపి నాయకులను అభినందిస్తూ అధిష్టానం నిర్దేశించిన సభ్యత్వ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పామర్తి వెంకటరామయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని చిలుకూరు గ్రామ సర్పంచి ముదునూరి వెంకట సోమరాజు తన అనుచరులతో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు సమక్షంలో ఆదివారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ పార్టీలకతీతంగా చిలుకూరు గ్రామాభివృద్ధికి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు సహకరిస్తున్న తీరు పట్ల ఆకర్షితులైన తాము టిడిపిలో చేరామని, టిడిపిని పటిష్ట పర్చడానికి, గ్రామాభివద్ధికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. అనంతరం కనుమూరి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ టిడిపిలో నూతనంగా చేరిన వారు ఇప్పటికే ఉన్న నాయకులను కలుపుకుని వెళ్లాలని, పార్టీని గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి అందరూ ఐకమత్యంగా పనిచేయాలని సూచించారు.

జనసేనలో చేరికలు

నరసాపురం:మొగల్తూరు మండలం ముత్యాలపల్లి, మోడీ గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు ఆదివారం జనసేనలో చేరారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సమక్షంలో బండి ముత్యాలమ్మ దేవస్థానం కమిటీ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, పలువురు బోర్డు సభ్యులు, 30 మంది నాయకులు నాయకర్ చేతుల మీదుగా జనసేన కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కడలి మాణిక్యాలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మంచి పరిపాలన అందిస్తోందని, అందువల్ల తన అనుచరులతో జనసేనలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి ముత్యాలరావు, శివాజీ, సాధనాల రామకృష్ణ, దాసరి శ్రీను, కర్రి వీరాస్వామి, బొల్లం శ్రీను పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు 8 గ్రాముల బంగారం విరాళం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మావుళ్లమ్మ అమ్మవారికి భీమవరానికి చెందిన ఎ.వెంకట రామరాజు, గౌతమీ సుభద్ర దంపతులు ఆదివారం 8 గ్రాముల బంగారం విరాళంగా అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

మొగల్తూరు:ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికలతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్య నిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్ట్

తాడేపల్లిగూడెం:ఆదివారం నిర్వహించిన దాడుల్లో బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబుతో సిబ్బందితో కలిసి పెంటపాడు మండలం మౌంజిపాడులో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


గోపీమూర్తికి వినతి అందజేస్తున్న పిజిటిలు

హైస్కూల్ ప్లస్ వ్యవస్థ కొనసాగింపునకు కృషి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భవిష్యత్తులో హైస్కూల్ ప్లస్ వ్యవస్థ కొనసాగింపునకు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా, కోనసీమ జిల్లా నుంచి హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్న పిజిటిల సమావేశానికి చింతపల్లి కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రెండు జిల్లాల పిజిటిలు గోపీమూర్తికి వినతిపత్రం అందజేసి హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను వివరించారు. దీనిపై ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ తాను హెచ్ఎస్ వ్యవస్థను కొనసాగించేందుకు శక్తి మేర కృషి చేస్తానని తెలిపారు. సమస్యను విద్యాశాఖా మంత్రికి ఈ రోజే పంపుతానని తెలిపారు. తానే స్వయంగా విద్యాశాఖా మంత్రికి లెటర్ ప్యాడ్ ద్వారా ఇచ్చి, ఒఎస్‌డితో సమస్యని ప్రత్యేకంగా మాట్లాడతానని చెప్పారు. భవిష్యత్తులో మీరు చేసే పోరాటాల్లో తాను పాల్గొంటానని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో జరిగే పోరాటాలకు యుటిఎఫ్ అండగా ఉంటుందని తెలిపారు. మీతోపాటు తాను పోరాటాల్లో పాల్గొంటానని తెలిపారు. చింతపల్లి కృష్ణమోహన్, ఎవి సుబ్బారావు, పి.వెంకటేశ్వరరావు, శ్యామల, గుణ, పిజిటిలు బి.శ్రీనివాస్, కిషోర్, పెద్దిరాజు గోపీమూర్తికి విషయాన్ని వివరించారు. ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ వ్యవస్థను కొనసాగించాలని లేకుంటే జిల్లా, రాష్ట్ర స్థాయిలో దశల వారీ పోరాటం చేస్తామని, ఈ పోరాటానికి యుటిఎఫ్ మద్దతు ఇవ్వాలని కోరారు.

మోహన్‌కు సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట సీనియర్ విలేకరి జవ్వాది మోహన్ తల్లి జవ్వాది సత్యవతి (76) ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, సిపిఎం సీనియర్ నాయకులు తలిపూరి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, తోటపల్లి సత్యనారాయణ, బొర్రా ధర్మారావు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయమే కేంద్రం : మంత్రి నిమ్మల

తాడేపల్లిగూడెంలో టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఏ పార్టీకైనా కార్యాలయమే ముఖ్య కేంద్రమని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం టిడిపి ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జున రావు (బాబ్జి) ఆధ్వర్యంలో నిర్మించిన నియోజకవర్గ టిడిపి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 2019 నుంచి 24 వరకూ రాష్ట్రాన్ని రూ.14 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిన వైసిపి ప్రభుత్వం ఏ మొహం పెట్టుకొని విద్యుత్ ఛార్జీల గురించి మాట్లాడుతోందని ప్రశ్నించారు. మళ్లీ అధికారంలోకి రావడానికి మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. 2014 నుంచి 19 వరకూ వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో తాడేపల్లిగూడెంలో టిడిపిని అన్నివిధాలా ముందుండి నడిపించిన ఘనత ఉలవల బాబ్జికి దక్కుతుందన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ 20 ఏళ్లుగా పట్టణంలో టిడిపికి సొంతంగా కార్యాలయం లేకపోవడం వల్ల పార్టీ శ్రేయస్సు కోసం కార్యకర్తలకు అందుబాటులో ఇంటి వద్ద తన సొంత నిధులతో కార్యాలయం నిర్మించడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఏలూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు, రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ షరీఫ్, టిడిపి నర్సాపురం ఇన్‌ఛార్జి పుత్తూరు రామరాజు పాల్గొన్నారు.

మంచి నాయకుడిని కోల్పోయాం : సర్పంచి

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు గాంధీ మృతి

ప్రజాశక్తి - కాళ్ల


కనగర్ల గాంధీ

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు కనగర్ల గాంధీ మంచి నాయకుడని, ఆయనను కోల్పోవడం బాధాకరమని ఏలూరుపాడు సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు అన్నారు. జువ్వలపాలెంలో అనారోగ్యంతో కనగర్ల గాంధీ (77) శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం ఉదయం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ గాంధీ మంచి వ్యక్తిత్వం, నడవడిక, పట్టుదల కలిగిన నాయకుడు అని కొనియాడారు. ఆర్య వైశ్య సంఘం, కార్యవర్గ సభ్యులందరినీ కలుపుకొనిపోతూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. ఆయన మరణం ఆర్య వైశ్య సంఘానికి తీరని లోటని అన్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భార్య రెండేళ్ల క్రితం మృతి చెందారు. కుమారుడు వెంకటేశ్వరరావు, కుమార్తె సంపూర్ణ విశాలాక్షి. ఆయన గత 20 ఏళ్లుగా కాళ్ల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా, ఏలూరుపాడు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు. ఏలూరుపాడు లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా పని చేశారు. ఏలూరుపాడులో ఆర్యవైశ్య కళ్యాణ మండపం నిర్మాణం ఆయన హయాంలోనే చేపట్టారు. ఆయన మృతికి ఏలూరుపాడు ఆర్య వైశ్య సంఘం, కార్యవర్గ సభ్యులు గోకరాజు యువరాజు, గోకరాజు లచ్చిరాజు, నడింపల్లి వెంకటరామరాజు సంతాపం తెలిపారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన ప్రెస్‌క్లబ్ సభ్యులు

ఉండి:ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజును, రాష్ట్ర మౌలిక వసతుల కల్పన శాఖ కార్పొరేషన్ ఛైర్మన్ మంతెన రామరాజును, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వేగేశ్న సూర్యనారాయణ రాజును వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్ నరసింహారాజును ఉండి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులకు నేతలు శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉండి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు దుండి కృష్ణమోహన్, సెక్రటరీ చిట్టూరి జోషి, ట్రెజరర్ బి. సత్యనారా యణమూర్తి, ఉపాధ్యక్షులు కె.రాజు పాల్గొన్నారు.

'దేవాలయాల పట్ల ప్రభుత్వ వైఖరి మారాలి'

ఉండి :హిందూ దేవాలయాల పట్ల ప్రభుత్వ అనుసరిస్తున్న వైఖరి మార్చుకోవాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు నల్లా సత్య కృష్ణ కిరణ్ ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షులు బండి బాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉండి శివాలయం నుంచి బస్టాండ్, రామాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్, బాల శ్రీనివాస్, గుండాబత్తుల సుబ్బారావు మాట్లాడుతూ ఆలయాల్లో దర్శనం టికెట్లు, ప్రసాదం రూపంలో ఆలయానికి వెళ్లే యాత్రికుల నుంచి దోపిడీ చేస్తున్నారని, ఆ డబ్బులను దేనికి కేటాయిస్తున్నారో వెల్లడించట్లేదని విమర్శించారు. ఆలయాల స్వయం ప్రతిపత్తి కోసం జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావాల్లో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సన్నిధి రాజు చలపతిరావు, ఖండాపు శ్రీనివాస్, దాసరి వరదరాజు, మారెళ్ల కామేశ్వరి పాల్గొన్నారు.

యుగాంతం వరకూ కందుకూరి సంస్కరణలు, రచనలు

ప్రజాశక్తి - భీమారం టౌన్

కందుకూరి వీరేశలింగం సంస్కరణలు, రచనలు యుగాంతం వరకూ నిలుస్తాయని, అటువంటి మహనీయుని పేరిట గ్రంథాలయాలను స్థాపించడం గొప్ప విశేషమని సాహిత్య వేత్త చెరుకువాడ వెంకటరామయ్య అన్నారు. ఆదివారం కుముదవల్లిలో కందుకూరి వీరేశలింగం గ్రంథాలయానికి విలువైన గ్రంథాలను దాతల సహకారంతో అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకట్రామయ్య మాట్లాడుతూ మహనీయుల పేరిట కుముదవల్లి వాసులు స్వాతంత్ర సమర యోధులు భూపతిరాజు తిరుపతిరాజు గ్రంథాలయాలను స్థాపించి 126 ఏళ్లుగా చిత్తశుద్ధిగా నడపడం గొప్ప విశేషమన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పుస్తకమే జీవితం పుస్తకమే ప్రాణంలా తమ సోదరులు జీవిస్తున్నారన్నారు. అతి విలువైన గ్రంథాలయానికి వెంకట్రామయ్య పుస్తకాలను అందించారన్నారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు భూపతిరాజు శ్రీనివాసరాజు, భూపతిరాజు నాగేంద్ర వర్మ, గౌరవాధ్యక్షులు రామకృష్ణంరాజు, సభ్యులు బుద్ధరాజు రామరాజు వెంకట్రామయ్యను సత్కరించారు. అరసవల్లి సుబ్రహ్మణ్యం, అల్లు శ్రీనివాస్, ఇందుకూరి వర్మ పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఆచంట

భీమవరంలో జనవరి 3, 4, 5 తేదీల్లో జరగనున్న సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ పిలుపునిచ్చారు. జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం ఆచంటలో ప్రజల నుంచి విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా ఆశించిన మార్పు జరగడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, సీనియర్ నాయకులు తలుపురి బుల్లబ్బాయి, తోటపల్లి సత్యనారాయణ, కుసుమే జయరాజు, బండి రంగారావు, బొర్రా ధర్మారావు, గుత్తుల రంగారావు, ఉన్నమట్ల పద్మారావు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించే ఇంటింటికీ వైద్యంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు హుస్సేన్ అహ్మద్, ఆర్థో డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకు, చివటం గ్రామాల్లో పర్యటించి వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. సంఘం సహాయ కార్యదర్శి శనివారపు చలపతిరావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు అల్లూరి కరుణాకర చౌదరి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తాడినాడకు సత్కారం

ప్రజాశక్తి - తణుకు

విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో భాగంగా తణుకుకు చెందిన కవి, రచయిత, సాహితీ సామ్రాజ్యం అధ్యక్షులు తాడినాడ భాస్కరరావు జడ్‌పిహెచ్ఎస్‌ప్లస్ పురిటిగడ్డ, చల్లపల్లి మండలం విద్యార్థులకు కవిత్వం అంటే ఏమిటి అంశంపై వివరించారు. కవిత్వం అంటే ఏమిటి, ఎలా రాయాలి, వేటిని పాటించాలి అనే అంశాలపై విపులంగా వివరించారు. ఆ సందర్భంగా విద్యార్థులు తాడినాడను ఘనంగా సత్కరించారు. సాహిత్య సుగంధాల సౌరభం అనే కవితను వినిపించి ప్రశంసలు పొందారు. నిర్వాహకులు శాలువా, మెమెంటో, ప్రశంసాపత్రంతో సత్కరించారు. గౌరవాధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్, అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, కార్యదర్శి జివి పూర్ణచందు, కిషోర్‌శర్మ, పి.రామకుమార్, ఆలపాటి సత్యవతి, యేలూరి ధర్మావతి, టి.ఉషారాణి, కె.లక్ష్మి, శశిధర్, భారతి తాడినాడను అభినందించారు.

పాలకొల్లులో మిత్రుల సమ్మేళనం

ప్రజాశక్తి - పాలకొల్లు

యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పాలకొల్లు మాజీ ఎంఎల్ఎ బాబ్జి తోటలో మిత్రుల సమ్మేళనం జరిగింది. చిన్నారులు ఆట పాటలు, నృత్యాలతో అలరించారు. సభ్యులు వేసిన నాటికలు కూడా అలరించాయి. యుకెఎస్‌సి డైరెక్టర్ ముచ్చర్ల సంజయ్, గవర్నర్ పెనుమాక రామ్మోహన్, అధ్యక్షులు జక్కంపూడి మదన్ కార్యదర్శి వేరుకొండ దుర్గా ప్రసాద్, కోశాధికారి శిరిగినీడి నాగార్జున, జిల్లా డైరెక్టర్ అరుణ తదితరులు పాల్గొన్నారు. ఆట పాటల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

పిఎంపి అసోసియేషన్ మండల అధ్యక్షులుగా వరప్రసాద్

ప్రజాశక్తి - నరసాపురం

పిఎంపి అసోసియేషన్ మండల అధ్యక్షులుగా కనకం వరప్రసాద్ ఎన్నికయ్యారు. దాదాపు 20 ఏళ్లుగా ఆయన పిఎంపిగా పనిచేస్తూ పలు పదవులను నిర్వహించారు. ఆదివారం వైఎన్ కళాశాలలో సంఘం జిల్లా అధ్యక్షులు జెవి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పులపర్తి మోహన్ అర్జునుడు, సహాయ కార్యదర్శిగా మేడిది చిట్టిబాబు, కోశాధికారిగా షేక్ అజీజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని పలువురు అభినందించారు. ఈ సమావేశంలో గంగాధర్, కుమారస్వామి పాల్గొన్నారు.

మురళీకృష్ణకు మాతృవియోగం

ప్రజాశక్తి - పాలకొల్లు

విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ అధినేత, లయన్స్ జిల్లా ప్రతినిధి కొమ్ముల మురళీకృష్ణ మాతృమూర్తి సత్యవతి (80) గుండె పోటుతో ఆదివారం మరణించారు. సత్యవతికి ఇద్దరు కుమారులు సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ, ఇద్దరు కుమార్తెలు విన్నకోట స్వరాజ్యలక్ష్మి, గ్రంధి దుర్గాంజలి ఉన్నారు. సత్యవతి భర్త శ్రీరామ్మూర్తి 2021 కోవిడ్ సమయంలో మృతి చెందారు. మురళీకృష్ణ 25 ఏళ్ల క్రితం శ్రీ విజయ లెబొరేటరీని పాలకొల్లులో స్థాపించి వైద్యరంగంతోపాటు లయన్స్ క్లబ్ ద్వారా సమాజానికి విలువైన సేవలందిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. సత్యవతి మృతిపట్ల పలువురు లయన్స్ ప్రతినిధులు, ప్రముఖ వైద్యులు, వివిధ రాజకీయ ప్రముఖులు సంతాపాన్ని వ్యక్తంచేస్తూ, కొమ్ముల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న నాగలక్ష్మి

ఉపాధ్యాయినికి అరుదైన గౌరవం

నరసాపురం:పట్టణంలోని పదో వార్డు మున్సిపల్ ప్రయిమరీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని (ఇంగ్లీష్ టీచర్)గా పనిచేస్తున్న వెంపరాల వెంకట సూర్య సత్య నాగలక్ష్మి గుజరాత్ పాలన్పూర్ యూనివర్సిటీ నిర్వహించిన అంతర్జాతీయ ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ సదస్సులో పాల్గొనే అవకాశం దక్కింది. ఈ నెల 28, 29 తేదీల్లో యూనివర్సిటీ నిర్వహించిన ఈ సదస్సులో ఆమె పాల్గొని యూనివర్సిటీ విసి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. మొత్తం 133 పరిశోధన పత్రాలు పోటీ పడగా వాటిలో 38 మాత్రమే ఎంపిక చేశారు. వాటిల్లో తెలుగు రాష్ట్రాల నుంచి నాగలక్ష్మి ఒక్కరే ఉన్నారు. ఇంగ్లీషు భాషాభివృద్ధి, బహుభాషా బోధన, మాతృభాష ఆవశ్యకతలపై ఆమె రాసిన పరిశోధన పత్రాలకు గాను ఈ ఆహ్వానం అందింది. ఇంగ్లీషు భాషాభివృద్ధిపై ఆమె అనేక పరిశోధనలు చేశారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డును కూడా ప్రకటించారు. ఆమెను యుటిఎఫ్ నాయకులు ఎం.మార్కండేయులు, ఎం.లక్ష్మీనారాయణ, ఎన్‌వి.సత్యనారాయణ, ఎస్.అజయ్ కుమార్, ఎం.మాణిక్యాలరావు, చంద్రకుమార్, సిహెచ్.కృష్ణ మోహన్ అభినందించారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలో ప్రజలకు దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని సర్పంచి అడ్డాల సూరిబాబు, ఎంపిటిసి సభ్యులు తిరుమాని స్వామి, కార్యదర్శి ఎం.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. దోమల నిర్మూలనకు గ్రామంలో మలాథియాన్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. గ్రామంలో అన్ని ప్రాంతాల్లోనూ దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని తెలిపారు. గ్రామంలోని ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేకత శ్రద్ధ చూపాలని సూచించారు.

కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల పాత్ర అమోఘం

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్‌కు 'కోస' అని నామకరణం చేశారు. పూర్వ విద్యార్థి ఎస్ఎన్ శ్రీనివాస్ గుప్త సమావేశానికి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఛాంబర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు, కళాశాల కార్యదర్శి కనుమూరి సీతారామరాజు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి.వాల్గా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు, సుమారు 80 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. 'కోసా' అని పూర్వ విద్యార్థుల సంఘానికి పేరు పెట్టడాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం అమోఘమన్నారు. కళాశాల కార్యదర్శి కనుమూరి సీతారాజు, ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు మాట్లాడారు.

పాస్‌పోర్టు పడిపోయినది

చెన్నూరి దివ్యశ్రీ అను నా యొక్క పాస్‌పోర్టు నెం.X7411808 నెంబరు గల పాస్‌పోర్టు పడిపోయినది. 24-12-2024వ తేదీ ఆదివారపు పేట నుంచి ఆర్.ఆర్.పేట వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ : X7411808 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్ : చెన్నూరి దివ్యశ్రీ,
లక్ష్మీవారపు పేట, గంగానమ్మ గుడి దగ్గర.
సెల్: 98487 03294

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.153/2021

Between:
బ్యాంకు ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ రి.బై బ్రాంచ్ మేనేజర్ ...వాది
అండ్
తమ్మిసెట్టి విక్టోరియా వగైరా టూ ...ప్రతివాదులు

1వ ప్రతివాది: తమ్మిసెట్టి విక్టోరియా, భర్త : రాజశేఖర్, డోర్‌నెం.24A-3-8A, రామయ్య హాల్, 11వ వార్డు, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నంబరు దావాను మీపైన మరియు 2వ ప్రతివాది పైన వాది బ్యాంకు వారికి రావలసిన బాకి రాబట్టుకొనుటకు గాను మీపైన మరియు 2వ ప్రతివాది పైన శ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 1వ ప్రతివాది అయిన మీకు త్రు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండ కాలయాపన చేయుచున్నందు, శ్రీకోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ **ది.10-01-2025** తేదికి వాయిదా వేసియున్నారు. కావున 1వ ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా **ది.10-01-2025** సం.తేదిన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియ జేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

అడబాల సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, నరసాపురం, ప.గో.జిల్లా.
నరసాపురం
తేది.26-12-24
స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ బ్యాంకు ఆఫ్ బరోడా నరసాపురం బ్రాంచ్.

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.174/2022

Between:
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, వల్లూరు బ్రాంచ్ రి.బై బ్రాంచ్ మేనేజర్ ...వాది
అండ్
చిట్టూరి వెంకట పెద్దిరాజు వగైరా ...ప్రతివాదులు టూ

2వ ప్రతివాది: మెల్లేటి వెంకన్నబాబు, తండ్రి త్రిమూర్తులు, డోర్‌నెం.1-54/4, భీమలాపురం గ్రామం, ఆచంట మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నంబరు దావాను 1వ,3వ,4వ ప్రతివాదులు మరియు 2వ ప్రతివాది అయిన మీపైన వాది బ్యాంకు వారికి రావలసిన బాకి రాబట్టుకొనుటకు గాను 1వ, 3వ, 4వ ప్రతివాదులు మరియు 2వ ప్రతివాది అయిన మీపైన శ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 2వ ప్రతివాది అయిన మీకు త్రు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండ కాలయాపన చేయుచున్నందున, శ్రీకోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ **ది.08-01-2025** తేదికి వాయిదా వేసియున్నారు. కావున 2వ ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా **ది.08-01-2025** సం.తేదిన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియ జేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

అడబాల సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, నరసాపురం, ప.గో.జిల్లా.
పాలకొల్లు
తేది.26-12-24
స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, వల్లూరు బ్రాంచ్.

NOTICE

IN THE COURT OF PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION)-CUM-JUDICIAL MEGISTRATE OF FIRST CLASS, TADEPALLIGUDEM

I.A.No.367/2024 in O.S.No.538/2021

Between:
1.Sunkara Damayanthi ...Petitioner/Plaintiff
And
1.Sunkavalli Durga and Others ...Respondents

To.
RESPONDENTS 3 & 4/DEFENDANTS 3 to 4 :
3.Nakkalapudi Sujatha, W/o.Siva Rama Krishna, D/o.Late Gadde Prakasarao, Hindu, Female, Aged 42 Yrs, R/o.Singarajupalem village of Nallajerla Mandal, West Godavari District (3rd Defendant)
4.Pinnamaneni Suneetha, W/o.Venkateswara Rao, D/o.Late Gadde Prakasarao, Hindu, Female, aged 40 Yrs, R/o.Singarajupalem Village of Nallajerla Mandal, West Godavari District. (4th Defendant)

Please take notice that the above I.A.No.367/2024 in O.S.No.538/2021 is filed by the petitioner/Plaintiff against the respondents/defendants which is posted for the appearance of the above respondents 3 & 4 / Defendants 3 & 4 on **07-01-2025 from 10.30 AM.** Onwards, on which day you may appear in person or through your advocate and file your objections/Pleadings if any. Otherwise the matter will be adjudicate according to law in your absence.

G.Syama Prasad Mukherjee
N.Surya Mani, Advocate,
Tadepalligudem.
Tadepalligudem Cell:70937 08178,
Date: 29-12-2024 79936 47211.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, తాడేపల్లిగూడెం

E.P.No.96/2012 in O.S.No.653/2002

బిట్వీన్:
మార్నీడి సత్యనారాయణ, తండ్రి: లేటు కృష్ణ మూర్తి, డో.నెం.3-22-16, హిందువు, పురుషుడు, విమలానగర్, 5వ వార్డు, సుబ్బారావు పేట, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
...డి. హెచ్. ఆర్ /ప్లెయింటిఫ్
మరియు
1) గూడా రామచంద్రరావు, తండ్రి: రాజా రావు, శివాలయం వీధి, 13వ వార్డు, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా. (డైడ్)
...1st J.D.R /ప్రతివాది
2) గూడా సావిత్రి, భర్త: లేటు రామచంద్రరావు, హిందువు, స్త్రీ, వయస్సు సుమారు 50 సం॥లు, 7వ వార్డు, పి అండ్ & కాలనీ, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
3) గూడా శ్రీనివాసరావు, తండ్రి: లేటు రామచంద్రరావు, హిందువు, పురుషుడు, వయస్సు సుమారు 35 సం॥లు, ప్రైవేటు ఉద్యోగం, 7వ వార్డు, పి అండ్ & కాలనీ, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
4) గూడా ఈశ్వరరావు, తండ్రి: లేటు రామచంద్రరావు, హిందువు, పురుషుడు, వయస్సు సుమారు 32 సం॥లు, ప్రైవేటు ఉద్యోగం, 7వ వార్డు, పి అండ్ & కాలనీ, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
5) గూడా గంగ తండ్రి: లేటు రామచంద్రరావు, హిందువు, స్త్రీ, వయస్సు సుమారు 30 సం॥లు, హౌస్ వైఫ్, 7వ వార్డు, పి అండ్ & కాలనీ, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
...2 టు 5 జె.డి.ఆర్స్

పైన తెలియజేసిన డి.హెచ్.ఆర్. డిక్రీ బాకీ వసూలు నిమిత్తం పై నెంబరు గల ఇ.పి.96/2012 పైన తెలిపిన కోర్టులో వేసి Attachement Schedule / Sale Paper Schedule లోని 1/3 వంతు వాటాకు సంబంధించి కోర్టులో సేల్ ప్రోసీడింగ్స్ కండక్ట్ చేసి సదరు ఆస్థి కోర్టులో వేలం వేసి డిక్రీ అమౌంటు వసూలు చేయించవలసినదిగా కోర్టు వారిని కోరియున్నాడు. కనుక మీకు ఎటువంటి అభ్యంతరములు /ఆక్షేపణలు ఉన్న ఎడల **ది.03-01-2025 సం॥రం తేదీన సదరు కోర్టు వారి ముందు ఉదయం గం॥10:30 ని॥లకు హాజరై మీ అభ్యంతరములు తెలుపవలసినదిగా కోర్టు వారి ఆదేశానుసారం మీకు తెలియజేయడమైనది.** లేని పక్షమున మీ పరోక్షమున సేల్ ప్రోసీడింగ్స్ కోర్టు వారిచే జరుపబడును అని మీకు తెలియజేయడమైనది.

తాడేపల్లిగూడెం,
27-12-24.
పండూరి రామం
న్యాయవాది,
డి. హెచ్. ఆర్. తరపు అడ్వకేట్,
సెల్: 73820 83577